

గడీల పాలనలో..

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కనీసం పది ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. వివరాలు 10లో ▸



హరీశ్‌రావుకు అండగా నిలుద్దాం

ఎన్నికల్లో మంత్రి హరీశ్‌రావుకు అండగా నిలవాలని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. వివరాలు 11లో ▸



అంగన్‌వాడీ సరుకులు పక్కదారి

అంగన్‌వాడీ కేంద్రాల్లో సరుకులు పక్కదారి పడుతున్నాయని ఆయా గ్రామాల సర్పంచ్‌లు అధికారులను నిలదీశారు. వివరాలు 11లో ▸

కలవని చేతులు!

ప్రచారానికి దూరంగా టికెట్ దక్కని నేతలు

- పలువురు బీఆర్ఎస్‌లో చేరేందుకు యత్నాలు
- నియోజకవర్గాల ఇన్‌చార్జుల కృషి ఫలించేనా?



సాక్షి, సిద్దిపేట: కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ఆ పార్టీ నేతలు కలిసిరావడంలేదు. టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ టికెట్‌లను ఎక్కువ మందే ఆశించారు. పార్టీ అధిష్టానం పలు సర్వేలు నిర్వహించి, పలు కేటగిరీలలో టికెట్లను కేటాయించింది. రెండు దఫాలలో అభ్యర్థులను ప్రకటించారు. సిద్దిపేట నుంచి 15 మంది, దుబ్బాక నుంచి ఐదుగురు, హుస్నాబాద్ నుంచి ఆరుగురు నేతలు గాంధీభవన్‌లో దరఖాస్తు చేశారు. అక్టోబర్ 27న సిద్దిపేట కాంగ్రెస్ అభ్యర్థిగా పూజల హరి కృష్ణ, దుబ్బాక అభ్యర్థిగా చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, హుస్నాబాద్ నుంచి పొన్నం ప్రభాకర్‌ను పార్టీ ప్రకటించింది.

సరైన గుర్తింపు లేకనే..

సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాకలలో టికెట్ ఆశించిన నేతలు అంటిముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రభాకర్ నామినేషన్ వేసే సమయంలో మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి వెంట ఉన్నారు. ఆ తర్వాత ఎక్కడా కనిపించడం లేదు. ప్రవీణ్‌రెడ్డి వర్గం నేతలకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని నాయకులు అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. దుబ్బాక టికెట్ కోసం చివరి వరకు శ్రవణ్‌కుమార్ తీవ్రంగా ప్రయత్నించారు. టికెట్ రాకపోవడంతో ఎన్నికల ప్రచారానికి దూరం అయ్యారు. శ్రవణ్‌కుమార్ వర్గం నేతలకు గుర్తింపు ఇవ్వడం లేదన్న కారణంగానే నిరాశగా ఉన్నట్లు తెలుస్తోంది. టికెట్ ఆశించిన మరో నేత కత్తి కార్తీక సైతం ప్రచారంలో పాల్గొనడం లేదు. బీఆర్ఎస్‌లో చేరే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది.

సిద్దిపేటలోనూ..

సిద్దిపేటలో 15 మంది టికెట్ ఆశించగా అందులో నలుగురు ముఖ్యనాయకులున్నారు. పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు సూర్యవర్మ, సీనియర్ నాయకులు గుడూరు శ్రీనివాస్, తాడూరి శ్రీనివాస్‌లు టికెట్ ఆశించారు. టికెట్ ప్రకటించిన ఐదు రోజులకు మేమంతా ఒక్కటేనని, హరికృష్ణ గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు. తర్వాత ప్రచారంలో ఈ నలుగురు నాయకులు పాల్గొనకపోవడం గమనార్హం. ఇందులో ఓ ఇద్దరు నేతలు ఇప్పటికే బీఆర్ఎస్ నేతలతో టచ్‌లో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

అసంతృప్తులను కలుపుకొని వెళ్తేనే..

ఆయా నియోజకవర్గాలకు కాంగ్రెస్ ఇన్‌చార్జిలుగా గతంలోనే పలువురిని నియమించారు. వారు అసంతృప్తి నేతలతో మాట్లాడి అందరినీ ఒక్కతాటి పైకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. పోటీ చేసే అభ్యర్థులు సైతం అసంతృప్తులను కలుపుకొని వెళ్తేనే ఓటర్లను తమవైపు మొగ్గు చూపే అవకాశం ఉంటుంది. లేనట్లయితే ఓట్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు.

44 గుర్తులు.. మూడు ఈవీఎంలు



ఓటర్లకు పరీక్షే..!

- 45 నంబర్ 'నోటా'కు కేటాయింపు
- మున్నెన్నడూలేని పరిస్థితి
- విభిన్నంగా గజ్వేల్ ఎన్నిక

గజ్వేల్: అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి విభిన్నమైన పరిస్థితి నెలకొన్నది. గజ్వేల్ బరిలో మున్నెన్నడూ లేని విధంగా 44మంది నిలిచారు. రాష్ట్రంలోనే అత్యధికంగా అభ్యర్థులున్న నియోజకవర్గంగా మారింది. ఈ క్రమంలో పోలింగ్ సందర్భంలో ఓటర్ల సహనానికి పరీక్ష తప్పేలా లేదు. సాధారణంగా ఒక్కో ఈవీఎం యంత్రంలో 16 గుర్తులు ఉంటాయి. ఇక్కడ పోటీలో ఉన్న 44 మంది కోసం మూడు యంత్రాలను వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 45 నంబర్‌ను 'నోటా'కు కేటాయించనున్నారు.

తొలి ఈవీఎంలోనే ప్రధాన అభ్యర్థులు..

తొలి ఈవీఎంలో గుర్తింపు పొందిన రాజకీయపార్టీలకు చెందిన ఈటల రాజేందర్(బీజేపీ)కు మొదటి నంబర్, తూంకుంట నర్సారెడ్డి(కాంగ్రెస్)కి రెండో నంబర్, కేసీఆర్(బీఆర్ఎస్)కు మూడో నంబర్, జక్కని సంజయ్‌కుమార్(బీఎస్పీ)కు నాలుగో నంబర్ కేటాయించనున్నారు. ఇకపోతే గుర్తింపు లేని రాజకీయ పార్టీల అభ్యర్థులు సదానందరెడ్డి(పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ), బుగ్గ రాజు (ధర్మ సమాజ్ పార్టీ), నేలపాటి నాగరాజు (విద్యార్థుల రాజకీయ పార్టీ), నీరుడి ప్రసాద్ (బ్లూ ఇండియా పార్టీ), పోతు అశోక్ (మన తెలంగాణ రాష్ట్ర సమాఖ్య పార్టీ), రచ్చ సుభద్రారెడ్డి (సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా), సిలివేరు ఇంద్రాగౌడ్(నేషనల్ నవక్రాంతి పార్టీ), రామరాజు(యువతరం పార్టీ), పోరెడ్డి వేణుగోపాల్(ఆబాద్ పార్టీ), రఘుమారెడ్డి(యుగతులసి పార్టీ), ధాత్రిక సంతోష్(నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), రంగన్నగారి జ్యోతి(ఇండియా ప్రజాబందు పార్టీ), రాగుల నాగరాజు(భారత చైతన్య యువజన పార్టీ), గడ్డం అనిత(ఘన సురక్ష పార్టీ), వొల్లాల ప్రవీణ్‌కుమార్ రావు(సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి), మహ్మద్ హైమద్(జన శంఖారావం పార్టీ), గడ్డం అశోక్(ఆల్ ఇండియా హిందుస్తాన్ కాంగ్రెస్ పార్టీ) తర్వాతి నంబర్లు రానున్నాయి. ఇవీ పూర్తయ్యాక ఇండిపెండెంట్ అభ్యర్థుల గుర్తులుంటాయి. 2018 సాధారణ ఎన్నికల్లో ఇక్కడ కేవలం 13మంది మాత్రమే బరిలో ఉన్నారు. ప్రస్తుతం 44మంది బరిలో ఉండటంతో మూడు ఈవీఎంలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పోలింగ్ సందర్భంగా వృద్ధులు, నిరక్షరాస్యులు తికమకపడే అవకాశముందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పోలింగ్ తీరు ఎలా ఉండబోతుందో వేచి చూడాల్సిందే.

అవగాహన కల్పిస్తాం: బన్సీలాల్

ఈ అంశంపై గజ్వేల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బన్సీలాల్ మాట్లాడుతూ పోలింగ్ సందర్భంగా ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు, తికమక తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ఓటర్లకు అవగాహన కూడా కల్పిస్తామని వెల్లడించారు.

న్యూస్‌రీల్

మూల మహోత్సవ వైభవం



వర్గల్ సరస్వతి అమ్మవారు

వర్గల్(గజ్వేల్): చదువుల తల్లి నెలవు వర్గల్ విద్యా సరస్వతి క్షేత్రం గురువారం మూల మహోత్సవ వైభవంతో అలరారింది. జన్మ నక్షత్ర వేళ తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి పర్యవేక్షణలో అమ్మవారి మూలవిగ్రహానికి విశేష పంచామృతాభిషేకం జరిపారు. సర్వాలంకార శోభితులైన అమ్మవారికి భక్తజన సామూహిక లక్ష పుష్పార్చన, లలితాపారాయణం, సప్తశతీ, చండీ పారాయణం, చండీ హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. కుంకుమార్చన చేశారు. వేడుకలో భక్తులు పాల్గొని తరించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

19న సిద్దిపేటలో సదర్



హర్యానాకు చెందిన బుల్

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో ఈనెల 19న యాదవ సదర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సదర్ నిర్వహించనున్నారు. స్థానిక క్లాక్ టవర్ వద్ద సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ సదర్‌లో హర్యానాకు చెందిన ఎద్దులు పాల్గొననున్నాయి. సిద్దిపేట పట్టణంలో తొలిసారిగా జరగనున్న సదర్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహక కమిటీ ప్రతినిధి సందీప్ యాదవ్ తెలిపారు.

ముగ్గురు బీజేపీ రెబల్స్ సస్పెన్షన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తూ ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీలో నిలిచిన ముగ్గురు అభ్యర్థులను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిద్దిపేట నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన సాయికుమార్, గుమ్మడి శ్రీశైలం, గజ్వేల్‌లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన దాసరి భానుచందర్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. బీజేపీ క్రమశిక్షణ గల పార్టీ అని అన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా వేటు తప్పదని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



టెన్త్ విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈఓ

వర్గల్(గజ్వేల్): టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం వర్గల్ మండలం నెంటూరు జెడ్పీఉన్నత పాఠశాలను సందర్శించారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. టెన్త్ విద్యార్థులతో మాట్లాడి దిశానిర్దేశం చేశారు. ప్రత్యేక తరగతులకు రోజూ హాజరుకావాలని, వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కష్టపడాలన్నారు. కాంప్లెక్స్ స్థాయి ఉపాధ్యాయులు విద్యార్థులలో సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల నోడల్ అధికారి వెంకటేశ్వరగౌడ్, కాంప్లెక్స్ హెచ్ఎం కనకరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎం ప్రజల పక్షం



మాట్లాడుతున్న అబ్బాస్

చేర్యాల(సిద్దిపేట): ప్రజల పక్షాన ఉండి సమస్యలపై పోరాడేది ఒక్క సీపీఎం మాత్రమేనని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బాస్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో సీపీఎం జనగామ అభ్యర్థి మోకు కనకారెడ్డితో కలిసి అబ్బాస్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నాశనం చేశాయని ఆరోపించారు. మతతత్వ పార్టీ అయిన బీజేపికి రాష్ట్రంలో స్థానం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు చూస్తే బీఆర్ఎస్‌ది అసమర్థ పాలన అన్నది తేలిపోయిందన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలన్నారు.

ఎన్నికల సిబ్బంది 5,061

- పూర్తయిన రెండో ర్యాండమైజేషన్
- నియోజకవర్గాల వారీగా అధికారుల నియామకం
- పాల్గొన్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: కలెక్టరేట్‌లో గురువారం ఎన్నికల అబ్జర్వర్ల సమక్షంలో పోలింగ్ అధికారుల రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 5,061 మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఇతర ప్రిసైడింగ్ ఆఫీసర్లకు రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ మేరకు సిద్దిపేట నియోజకవర్గానికి 327 మంది ప్రిసైడింగ్, 327 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్, 655 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులను నియమించారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి 158 ప్రిసైడింగ్, 158 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్, 316 ఇతర ప్రిసైడింగ్ అధికారులను నియమించగా, దుబ్బాకలో 237 ప్రిసైడింగ్, 237 అసిస్టెంట్ ప్రిసైడింగ్, 475 ఇతర ప్రిసైడింగ్‌లను నియమించారు. గజ్వేల్ నియోజకవర్గానికి 313 ప్రిసైడింగ్, 313 అసిస్టెంట్ ప్రిసైడింగ్, 628 ఇతర ప్రిసైడింగ్ అధికారులను ఏర్పాటు చేశారు. మానకొండూరులో 50 ప్రిసైడింగ్, 50 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్, 100 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులు, జనగాం నియోజకవర్గానికి 122 మంది ప్రిసైడింగ్, 122 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ 244 మంది ఇతర పిసైడింగ్ అధికారులను రెండో ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈ ప్రక్రియలో హుస్నాబాద్, సిద్దిపేట నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్ జయశ్రీ ఎస్.భోజ్ (ఐఏఎస్), దుబ్బాక, గజ్వేల్‌కు చెందిన జనరల్ అబ్జర్వర్ మన్మోహన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువతే కీలకం

- అభ్యర్థుల గెలుపోటములు వారి చేతుల్లోనే..
- జిల్లాలో 39ఏళ్లలోపు వారు 4.89 లక్షలు
- 40ఏళ్లకుపైగా ఉన్నవారు 4.59 లక్షల ఓటర్లు
- ప్రసన్నం చేసుకునేలా అభ్యర్థుల ప్రచారాలు



సాక్షి, సిద్దిపేట: అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి యువత కీ రోల్ పోషించనున్నారు. అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించనున్నారు. దీంతో యువతను ఆకట్టుకునేందుకు అన్ని పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. తమ అస్త్రాలకు పదునుపెడుతూ యువతకు గాలం వేస్తున్నాయి. నాలుగు నియోజకవర్గాల్లో 9.48లక్షల మంది ఓటర్లు ఉండగా 39 ఏళ్ల లోపు 4.89లక్షల మంది ఉన్నారు. 40 యేళ్లకు పైగా 4.59లక్షల మంది ఉన్నారు. అత్యధికంగా యువ ఓటర్లు గజ్వేల్ నియోజకవర్గంలో 1,47,913 మంది, అత్యల్పంగా దుబ్బాక నియోజకవర్గంలో 99,311 మంది ఓటర్లున్నారు. ఈ నెల 30న ఎన్నికల్లో తుది జాబితాలో పేర్లు ఉన్న ఓటర్లు పాల్గొనున్నారు. ఆయా రాజకీయ పార్టీలు యువత లక్ష్యంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు.

యువతే లక్ష్యంగా..

40 ఏళ్లలోపు ఉన్న ఓటర్లలో 95 శాతం మంది స్మార్ట్‌ఫోన్లు ఉపయోగిస్తున్నారు. దీంతో వారిని లక్ష్యంగా చేసుకుని రాజకీయ పార్టీలు, ప్రధాన పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు సోషల్ మీడియా ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులు పెన్షన్లు, రైతుబంధు, పోడు పట్టాల పంపిణీ తదితర సంక్షేమ కార్యక్రమాల కంటే కూడా ఐటీ, పరిశ్రమలు వంటి అభివృద్ధి కార్యక్రమాలపై రీల్స్ చిత్రీకరించి పోస్ట్ చేస్తున్నారు. యువ ఓటర్లను ఆకర్షించే పనిలో వ్యూహాలు రూపొందిస్తున్నారు.

వయసు	సిద్దిపేట	గజ్వేల్	దుబ్బాక	హుస్నాబాద్	మొత్తం
18-19	6,337	8,844	6,061	7,293	28,535
20-29	46,739	60,274	45,331	48,332	2,00,676
30-39	67,460	78,795	47,919	66,026	2,60,200
40-49	47,310	50,136	39,293	46,238	1,82,977
50-59	32,336	36,635	27,551	34,294	1,30,816
60-69	20,263	23,744	18,820	23,981	86,808
70-79	10,888	13,191	10,251	14,017	48,,347
80కి పైగా	2,400	3,035	2,874	2,001	10,310

తప్పిన పెను ప్రమాదం

అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



రోడ్డు పక్కకు ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు

హుస్నాబాద్: ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లిన ఘటన గురువారం జిల్లెల్లగడ్డలో చోటు చేసుకుంది. ఆర్టీసీ డ్రైవర్ ఎల్ఏ రెడ్డి, కండక్టర్ జలంధర్‌లు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హన్మకొండ నుంచి హుస్నాబాద్‌కు వెళ్తోంది. జిల్లెల్లగడ్డ శివారులో ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో బస్సు అదుపు తప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. ఆర్టీసీ బస్సులో ఉన్న 50 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

సీఎంను కలుస్తా.. నిధులు తెస్తా



జనగామ: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



రేబర్తిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- ప్రజలు, పార్టీ కేడర్‌ను కాపాడుకుంటా
- జనగామ, చేర్యాల రెండు చోట్లా అందుబాటులో ఉంటా..
- రేవంత్‌రెడ్డికి అసహనం పెరిగిపోతోంది
- బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: సీఎం కేసీఆర్‌ను బరాబర్ కలుస్తా.. జనగామ అభివృద్ధికి నిధులు తీసుకువస్తా.. స్థానికంగా అందుబాటులో ఉంటూ ప్రజలు, పార్టీ కేడర్‌ను కంటికి రెప్పలా కాపాడుకుంటానని బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం పట్టణంలోని 1, 6, 10, 18 వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే గ్రెయిన్ మార్కెట్, పూసల కులస్తులు, పార్టీ శ్రేణులతో సమావేశమై మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలువగానే జిల్లా కేంద్రం, చేర్యాలలో ఇంటి నిర్మాణం చేపట్టి ఇక్కడే ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పల్లా అన్నారు. జనగామను సిద్దిపేట, గజ్వేల్‌కు దీటుగా అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. బీఆర్ఎస్‌ను మూడోసారి ఆదరించాలని, అధికారంలోకి రాగానే గ్యాస్ సిలిండర్ రూ.400కే అందజేస్తామని, ఆసరా పింఛన్ పెంచడంతోపాటు సంక్షేమ పథకాలు వందశాతం కొనసాగిస్తామన్నారు. ఆపత్కాలంలో ఎంతోమంది నిరుపేదలకు సీఎం సహాయ నిధి నుంచి కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందించామని, వడ్లకొండకు చెందిన దయాకర్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా నీలిమ ఆస్పత్రిలో ఉచిత వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు.

రేవంత్‌లో అసహనం..

ప్రజల కోసం సీఎం వద్దకు వెళ్తే పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి తప్పులా ఎందుకు అనిపించిందో అర్థం కావడం లేదు.. తన వద్దకు వచ్చిన వారిని రేపు.. మాపు అని తిప్పించుకునే అలవాటు లేదని అన్నారు. జనగామ సభలో రేవంత్ ప్రసంగానికి జనం నుంచి రెస్పాన్స్ లేదు.. మాటిమాటికీ చీదరించుకోవడం ఆయన అసహనాన్ని మరోసారి గుర్తు చేసిందని అన్నారు. చేర్యాలలో జరిగే సీఎం కేసీఆర్ సభకు ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలివచ్చి మీటింగ్ ఎలా ఉంటుందో నిరూపించనున్నారని పేర్కొన్నారు.



జనగామ: వ్యవసాయ మార్కెట్‌లో హమాలీలు, ఇతరులతో మాట్లాడుతున్న రాజేశ్వర్‌రెడ్డి

పూసల కులస్తుల సమావేశంలో..

జిల్లా కేంద్రం పూసల భవనంలో కులస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. వృత్తి, చట్టపరంగా రావాల్సిన అన్ని పథకాలు అందేలా చూడడంతోపాటు సంఘానికి స్థలం ఉంటే కమ్యూనిటీ భవనం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు.. వారిని నమ్మి మోసపోవద్దని వార్డుల్లో ఇంటింటి ప్రచారంలో ప్రజలకు సూచించారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వివరించారు.

వ్యవసాయ మార్కెట్‌లో..

ఏఎంసీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగంతో కలిసి జనగామ వ్యవసాయ మార్కెట్‌లో రైతులు, హమాలీలు, మిల్లర్లతో పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. దేశంలో రైతుకు పెట్టుబడి సాయం ఇచ్చే ఏకైక సీఎం కేసీఆర్ అని అన్నారు. హమాలీలు, దడువాయి, స్వీపర్లకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. అన్నపూర్ణ పథకం ద్వారా మార్కెట్‌లో రూ.5కే భోజన సౌకర్యం కల్పిస్తామని, అత్యాధునిక టెక్నాలజీతో కోల్డ్ స్టోరేజీ, గోదాంల నిర్మాణం చేపడతామన్నారు. వ్యవసాయ ఖర్చులు పెరగడంతో రైతుబంధు సాయం రూ.16 వేలకు పెంచాలని కేసీఆర్ నిర్ణయించారని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. వికాస్‌నగర్‌లోని పల్లా నివాసంలో పలు పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు.

'పల్లా' అంటే ఓ నమ్మకం.. భరోసా

పల్లా రాజేశ్వర్‌రెడ్డి అంటేనే ఓ నమ్మకం, పేదలకు భరోసా అని ఆయన సతీమణి నీలిమ అన్నారు. జనగామ మండలం పెంబర్తిలో ఆమె ఇంటింటి ప్రచారం చేపట్టగా ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ జనగామ గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగురవేసేందుకు ప్రజలు, పార్టీ శ్రేణులు కంకణబద్ధులై ఉన్నారని చెప్పారు. గ్రామంలో మిగిలి పోయిన అభివృద్ధి కార్యక్రమాలను రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందగానే పూర్తి చేస్తారని హామీ ఇచ్చారు.

రాజేశ్వర్‌రెడ్డి గెలుపే లక్ష్యం

మద్దూరు(హుస్నాబాద్)/కొమురవెల్లి(సిద్దిపేట): బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధి పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం హనుమతండా పంచాయతీ నాలుగో వార్డు సభ్యురాలు కళావతి శంకర్ బీఆర్ఎస్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం, మండల ఉపాధ్యక్షుడు మంద సుమన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆరీఫ్, మండల ఇన్‌చార్జ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కొమురవెల్లి మండలం రసులాబాద్‌లో సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి, గ్రామశాఖ అధ్యక్షుడు కనుకయ్య ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

చిన్నరామన్‌చర్లలో ఇంటింటి ప్రచారం..

బచ్చన్నపేట: బచ్చన్నపేట మండలం చిన్నరామన్‌చర్ల గ్రామంలో జాగృతి మండల మాజీ అధ్యక్షురాలు పిన్నింటి కావ్యశ్రీరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మద్దికుంట రాధ, మాజీ సర్పంచ్ కంసాని మమత, ఎంపీటీసీ మామిడి అరుణ, నాయకులు అయిలయ్య, బాలకృష్ణ, శ్రీను, వెంకటేష్ , నర్సింగ్, స్వరూప, తార, రాజమణి, విజయ పలువురు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్



కేసీఆర్‌తో హరీశ్‌రావు ముచ్చట

హరీశ్ హాజరై.. అన్నీ తానై

- 16 గంటలు.. 12 కార్యక్రమాలు..
- రోడ్‌షోలు, ఆత్మీయ సమ్మేళనాలతో బిజీబిజీ
- చేరికల కోసం కాంగ్రెస్, బీజేపీ నేతల ఇళ్లకు..
- మద్దతు కూడగట్టేందుకు సీపీఎం కార్యాలయానికి..
- బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం చెమటోడుస్తున్న మంత్రి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా చెమటోడుస్తున్నారు మంత్రి హరీశ్‌రావు. గురువారం జిల్లాలో బిజీబిజీగా గడిపారు. బుధవారం రాత్రి సంగారెడ్డిలోనే నిద్రించిన ఆయన ఉదయం ఏడు గంటల నుంచే తన దినచర్యను ప్రారంభించారు. రాత్రి పది గంటల వరకు సుమారు 16 గంటల పాటు వివిధ కార్యక్రమాలు, ప్రచార సభలతో క్షణం తీరిక లేకుండా గడిపారు. పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు బీఆర్ఎస్‌లో చేరేలా అన్నీ తానై వ్యవహరించారు.

ముఖ్యనేతల నివాసాలకు..

కాంగ్రెస్, బీజేపీలకు చెందిన రాష్ట్ర స్థాయి, జిల్లా నాయకులు బీఆర్ఎస్‌లో చేరేలా మంత్రి హరీశ్‌రావు కీలకంగా వ్యవహరించారు. గురువారం ఉదయమే టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మెదక్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి గాలి అనిల్ నివాసానికి వెళ్లిన పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సంగారెడ్డి టికెట్ ఆశించి భంగపడిన రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే నివాసానికి వెళ్లిన మంత్రి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు.

సీపీఎం కార్యాలయానికి స్వయంగా వెళ్లి..

జిల్లాలో సీపీఎం పార్టీ మద్దతు కూడగట్టేందుకు హరీశ్‌రావు స్వయంగా సంగారెడ్డిలోని ఆ పార్టీ కార్యాలయానికి వెళ్లారు. స్థానిక బీఆర్ఎస్ అభ్యర్థి చింతప్రభాకర్‌తో కలిసి సీపీఎం నేతలతో చర్చలు జరిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో మాత్రమే సీపీఎం పోటీ చేస్తోంది. మిగిలిన చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలని ఆ పార్టీ నేతలను కోరారు.



గిరిజన సదస్సులో మాట్లాడుతున్న హరీశ్‌రావు

రోడ్ షోలు, కులసంఘాల సమ్మేళనాలు..

ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో భాగంగా హరీశ్‌రావు పలు చోట్ల రోడ్‌షోలు, కుల సంఘాల నేతల ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొన్నారు. జహీరాబాద్ నియోజకవర్గం హద్నూర్‌లో జరిగిన ప్రజాఆశీర్వాద సభలో పాల్గొన్న మంత్రి కర్నాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఐదు నెలల్లోనే విఫలమైన తీరును వివరించారు. ఎస్టీల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మంత్రి గిరిజనుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఎరుకల కులస్తులతోనూ ఆయన సమావేశమయ్యారు. అనంతరం ఈనెల 23న జహీరాబాద్‌లో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడి నుంచి నర్సాపూర్‌లో జరిగిన సీఎం కేసీఆర్ బహిరంగసభకు హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం పటాన్‌చెరులోని ఇస్నాపూర్ సభకు చేరుకొని సభనుద్దేశించి మాట్లాడారు. ఇలా గురువారం రోజంతా సంగారెడ్డి జిల్లాలోనే గడిపారు.

మల్లేశ్‌తో ముచ్చటించిన మంత్రి..

హద్నూర్‌లో పర్యటించిన హరీశ్‌రావు కర్నాటక రాష్ట్రంతో బంధుత్వం ఉన్న మల్లేశ్ అనే వ్యక్తితో ముచ్చటించారు. స్థానికంగా ఓ ఫ్యాక్టరీలో ఉద్యోగిగా పని చేస్తున్న మల్లేశ్ కర్నాటకలోని పరిస్థితులను మంత్రితో తెలిపారు.



సభకు తరలి వస్తున్న జనం

ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నర్సాపూర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్ అయ్యింది. సీఎం కేసీఆర్ ప్రసంగం గులాబీ శ్రేణుల్లో జోష్ నింపింది. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలి రావడంతో సభాప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆ పరిసరాలు ఫ్లెక్సీలు, పార్టీ జెండాలతో గులాబీమయంగా మారాయి. సభలో కాంగ్రెస్‌పై కేసీఆర్ నిప్పులు చెరిగారు.



కళాకారుల నృత్య ప్రదర్శన

బీఆర్ఎస్‌లో చేరికలు

నర్సాపూర్ రూరల్, శివ్వంపేట: ప్రజా ఆశీర్వాద సభలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్, నర్సాపూర్ ఎంపీపీ జ్యోతి, మెదక్‌కు చెందిన పీసీసీ నేత మ్యాడం బాలకృష్ణ, అజ్మత్ అలీ, సురేష్‌నాయక్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు చేరారు. అలాగే.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి, కౌన్సిలర్ సునీత, బాల్‌రెడ్డి, సంగారెడ్డి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రాజేశ్ దేశ్‌పాండే, పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ గడిల శ్రీకాంత్‌లకు సీఎం కేసీఆర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.



గాలి అనిల్ కుమార్‌కు పార్టీ కండువా కప్పుతున్న సీఎం కేసీఆర్



సింగాయిపల్లి గోపి..



రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే..



మ్యాడం బాలకృష్ణ..

సీఎం సభ హైలెట్స్

నర్సాపూర్ రూరల్/ శివ్వంపేట: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నర్సాపూర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి మాట్లాడారు.

- మంత్రి హరీశ్‌రావు 5.07 నిమిషాలకు వేదిక పైకి చేరుకుని మాట్లాడారు
- సీఎం కేసీఆర్ హెలీకాప్టర్ 5.32 నిమిషాలకు సభాస్థలం వద్ద ల్యాండ్ అయింది
- 5.45 నిమిషాలకు సీఎం కేసీఆర్ వేదికపైకి వచ్చి అభివాదం చేశారు
- 5.58 నిమిషాలకు ప్రసంగం ప్రారంభించి 6.20 నిమిషాలకు ముగించారు
- ప్రముఖ కళాకారుడు ఎపురి సోమన్న పాటలతో ఉత్తేజపరిచారు
- కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు భారీ బందోబస్తు నిర్వహించారు.
- నర్సాపూర్ చౌరస్తా నుంచి సభాస్థలం వరకు రెండు కిలో మీటర్ల రోడ్డు కిక్కిరిసింది
- సభ ముగిసిన అనంతరం సీఎం కేసీఆర్ రోడ్డు మార్గాన ఎర్రవల్లిలోని ఫామ్‌హౌజ్‌కు వెళ్లారు



అవ్వా.. నీ ఓటు కారుకే..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని చెలుకలపల్లిలో బీఆర్ఎస్‌కు మద్దతుగా మహిళా విభాగం నాయకురాలు రాజశ్రీ,, ఏఎంసీ చైర్మన్ కొండం వనిత, సరోజన, కనకవ్వలు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వృద్ధురాలిని బుజ్జగిస్తూ.. కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని అభ్యర్థించారు.



డప్పు కొడుతూ.. ఇస్త్రీ చేస్తూ..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. గురువారం పట్టణంలోని 2వ వార్డులో స్థానిక బీఆర్ఎస్ కౌన్సిలర్ నాయిని చంద్రం డప్పు కొడుతూ.. ఇస్త్రీ చేస్తూ హరీశ్‌రావుకే ఓటు వేయాలని అభ్యర్థించారు.



కూరగాయలు అమ్ముతూ..

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి ఓ దుకాణం వద్ద కూరగాయలు విక్రయిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు బాగయ్య, ఉమేష్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి



ఓ హోటల్‌లో చాయ్ చేస్తున్న క్రాంతికిరణ్

ఎమ్మెల్యే క్రాంతికిరణ్

రాయికోడ్(అందోల్): బీఆర్ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధి జరిగిందని, మరోసారి ఆ పార్టీకి ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఓటర్లను కోరారు. మండలంలోని మోరట్గా, మామిడిపల్లి, కర్చల్, నాగన్‌పల్లి, రాయిపల్లి తదితర గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి, డప్పులతో స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆయా గ్రామాలకు తన హయాంలో కేటాయించి నిధులు, చేసిన అభివృద్ధి, ఎన్నికల మేనిఫెస్టో గురించి ఓటర్లకు వివరించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే మూడు గంటల కరెంటు సరఫరాతో ఇబ్బందులు తప్పవని ఆరోపించారు. 40 ఏళ్లు పాలించి గ్రామాలను, పేదలను పట్టించుకోని వారి మాయమాటలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయన్నారు. ఓ హోటల్‌లో ఆయన చాయ్ చేసి, డప్పు కొట్టి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో బసవరాజ్ పాటిల్, శంకర్, సిద్దప్ప పాటిల్, విఠల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో కన్నీళ్లే..

ములుగు(గజ్వేల్): కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో కన్నీళ్లే మిగలడంతో పాటు బీఆర్ఎస్ పునర్నిర్మిస్తుందని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ములుగు మండలంలోని ఆర్అండ్ఆర్ కాలనీ(బహిలంపూర్)లో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువరించిన కేసీఆర్ ప్రసంగపాఠం 'కాంగ్రెస్ చేసిందేందీ?' అనే పుస్తకాన్ని గురువారం రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ములుగు మండల ఎన్నికల ఇన్‌చార్జి డాక్టర్ పిర్యాల రవీందర్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, బీఆర్ఎస్ యూత్‌వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాష, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజలను ఓటు బ్యాంకుగా చూసారే తప్ప తెలంగాణను మానవ సంపదగా మార్చలేదని వారు ధ్వజమెత్తారు.

పని చేసే ప్రభుత్వాన్ని ఆదరించాలి

కొండపాక(గజ్వేల్): పని చేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మండల ఇన్‌చార్జి లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. కుకునూరుపల్లి మండలంలోని లకుడారం, కుకునూరుపల్లి, బొబ్బాయిపల్లి గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల బాగు కోసం సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని గమనించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఆచరణకు సాధ్యం కానీ హామీలను ఇస్తూ ఓట్ల కోసం కొత్త బిచ్చగాళ్ళ మాదిరిగా గ్రామాల్లో తిరుగుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవి రవీందర్, కోల సద్గుణ, పొల్కంపల్లి నరేందర్, పిస్క అమరేందర్, కోల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గడీల పాలనలో తీరని అన్యాయం

పదేళ్లలో పది ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు..

- బీజేపీ దుబ్బాక అభ్యర్థి రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కనీసం పది ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని, కేసీఆర్ ఇంట్లో మాత్రం అందరికీ పదవులు వచ్చాయని దుబ్బాక బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు బీజేపీలో చేరారు. అలాగే దుబ్బాక నియోజకవర్గంలోని నార్సింగ్ మండలంలోని నర్సంపల్లి, పెద్దతండా, వల్లభాపూర్, వల్లూర్, భీంరావుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ గడీల పాలనలో ఉద్యోగాలు రాక యువతకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కనీసం ఉద్యోగ పరీక్ష నిర్వహించలేని పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం ఉందన్నారు. పరీక్ష పేపర్ల లీకేజీలో ప్రభుత్వ పెద్దల హస్తం ఉందన్న సంగతి ప్రజలందరికీ తెలిసిందేనన్నారు.

దుబ్బాకలో హరీశ్ పెత్తనమేంటి?

దుబ్బాక నియోజకవర్గం పై హరీశ్‌రావు పెత్తనమేంటని, కేవలం ఎన్నికలప్పుడే వచ్చి సిద్దిపేట, దుబ్బాక నాకు రెండు కళ్లు అంటూ.. ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తే ప్రజలు నమ్మరని రఘునందన్‌రావు అన్నారు. హరీశ్ మాటలు, నాటకాలు సిద్దిపేటలో నడుస్తాయని, దుబ్బాకలో కుదరవని ఎద్దేవా చేశారు. ఉన్న నిధులన్నీ సిద్దిపేటకే తరలించుకుపోయి దుబ్బాక నియోజకవర్గానికి హరీశ్ తీరని అన్యాయం చేశాడని ఆరోపించారు. ట్రబుల్ షూటర్ హరీశ్‌రావుకు గత ఉప ఎన్నికల్లో దుబ్బాక ప్రజలు దిమ్మ తిరిగేలా చేశారని, ఇప్పుడు కూడ సేమ్ రిపీట్ అవుతుందన్నారు. సిద్దిపేట కోమటిచెరువుకు పెట్టిన నిధుల్లో కనీసం సగమన్నా దుబ్బాకకు ఇచ్చావా అని ప్రశ్నించారు.

ప్రశ్నించే గొంతుకకే దుబ్బాక ప్రజల పట్టం

బీఆర్ఎస్ ప్రభుత్వ అహంకారపూరిత పాలనపై ఎదురొడ్డి పోరాడుతున్న తనను దుబ్బాక ప్రజలు గుండెల్లో పెట్టుకొని గెలిపించుకుంటారన్నారు. గత ఉపఎన్నికల్లోనే ఎన్నో కుట్రలు, కుతంత్రాలను తిప్పిగొట్టారని, ఈ ప్రాంత ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా అసెంబ్లీలో సమస్యలు వినిపించి అనేక అభివృద్ధి పనులు పూర్తి చేయించానన్నారు. తనతోనే దుబ్బాకలో కొత్త బస్టాండ్ నిర్మాణం, వంద పడకల ఆస్పత్రి, ఐటీఐ భవనం, ఐఓసీ కార్యాలయంతో పాటు అనేక అభివృద్ధి పనులు పూర్తయ్యాయని గుర్తు చేశారు. దుబ్బాక-ముస్తాబాద్ డబుల్ రోడ్డుకు కేంద్ర ప్రభుత్వం నిధులు రూ.12.5 కోట్లు మంజూరి చేయించానని, ఎల్కతుర్తి టూ సిద్దిపేట-దుబ్బాక మండలం నుంచి మెదక్‌కు జాతీయ రహదారి నిర్మాణం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతుందన్నారు. కేంద్రం నిధులు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం తామే చేస్తున్నామంటు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు.



చిన్నమాసాన్‌పల్లిలో రఘునందన్‌రావుకు ఘనస్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రభాకర్‌రెడ్డి ఏం చేసిందు?

రెండు సార్లు ఎంపీగా ఉన్న ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక నియోజకవర్గంకు ఏం చేసిండో చెప్పాలని రఘునందన్‌రావు ప్రశ్నించారు. ఎంపీ నిధులను దుబ్బాకకు ఇవ్వకుండా గజ్వేల్, సిద్దిపేట, పటాన్‌చెరువుకే కేటాయించారన్నారు.

రాబందులను పాతర పెట్టాలి

రాయపోలు(దుబ్బాక): తెలంగాణను కేసీఆర్ దొర జాగీరుగా మార్చుకున్నాడని రఘునందన్‌రావు ఆరోపించారు. మండలంలోని మంతూరు, చిన్న మాసాన్‌పల్లి, గజ్వేల్ మండలం చిన్న ఆరెపల్లిలలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కనీసం రేషన్ కార్డు ఇవ్వడం చేతకాని సీఎం కేసీఆర్ కుటుంబం రాబందుల్లా తెలంగాణపై పడి దోచుకుతింటున్నారని తీవ్రంగా విమర్శించారు.రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వం ఏర్పాటయితే కేసీఆర్ తిన్నదంతా కక్కిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు మంకిడి స్వామి, వెంకటేశ్‌గౌడ్, స్వామి, నర్సింలు, సత్యపాల్‌రెడ్డి, తిరుపతి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సోమ్లా తండాలో ప్రచారం

చేగుంట(తూప్రాన్): మండలంలోని సోమ్లా తండాలో గురువారం రఘునందన్‌రావును గెలిపించాలని గిరిజన యువ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సుభాష్‌నాయక్, దేవ్లా, సుధాకర్‌నాయక్ ఉన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య తోపులాట

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కాసులాబాద్‌లో గురువారం బీఆర్ఎస్, బీజేపీల మధ్య తోపులాట చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల ఎన్నికల ప్రచారం చేస్తున్న మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి కత్తిపోటుకు గురై చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తనయుడు కొత్త పృథ్వీ కృష్ణారెడ్డి తన తండ్రికి మద్దతుగా కాసులాబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌తో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా.. రఘునందన్‌రావు దుబ్బాకకు చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఈ సందర్భంగా ఫారూఖ్ హుస్సేన్ ఘాటుగా విమర్శలు చేశారు. దీంతో అక్కడే ఉన్న బీజేపీ కార్యకర్తలు రఘునందన్‌రావుకు అనుకూలంగా నినాదాలు హోరెత్తించారు. ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ఏనాడూ తమ గ్రామాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. దీంతో బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మధ్య తీవ్ర వాగ్యుద్ధం నెలకొంది.

రామాయంపేట(మెదక్): నర్సంపల్లి రైతుల భూములకు సంబంధించి పట్టా సర్టిఫికెట్లు, పాసుబుక్కులు ఇప్పిస్తామని రఘునందన్‌రావు హామీ ఇచ్చారు. గురువారం రాత్రి నార్సింగి మండలం నర్సంపల్లి, పెద్ద తండా, వల్భాపూర్‌లో ఆయన ప్రచారం నిర్వహించారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి సమస్యల గురించి ఏనాడూ పట్టించుకోలేదని ఆరోపించారు.



నర్సంపల్లిలో మాట్లాడుతున్న దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు



సోమ్లాతండాలో ప్రచారం చేస్తున్న బీజేపీ యూత్ నాయకులు